
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 25 ఏప్రిల్ 2025 | 5




కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.2 (గురువారం)
కనిష్ఠం : 26.6

అందాల రాక్షసివే.. కశ్మీర్..టెర్రర్

అందాల కశ్మీరం.. ఉగ్రదాడితో కాష్మోరాగా మారిపోయింది.. కాష్మోరా సినిమా చూడాలంటేనే భయపడినట్టు.. ప్రస్తుతం కశ్మీరం వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు.. వేసవి సెలవుల నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇప్పటికే ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్న వందలాదిమంది తమ టూర్ క్యాన్సిల్ చేసుకుంటున్నారు.. ఆ అందాల రాక్షసిని తిలకించాలంటే ముందు మేం ఉండాలి కదా.. అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు..

- కాకినాడ,ఆంధ్రజ్యోతి



ప్రకృతి.. వలయం : కశ్మీర్‌లోని బైసరన్ ప్రాంతం



మంచుకొండల్లోన సంద్రమా : కశ్మీర్ సోనామార్గ్‌లో గురువారం మంచు ఇలా..

రాజమహేంద్రవరంలో ఓ వ్యాపారి వేసవి సెలవుల్లో కుటుంబంతో సహా కశ్మీర్ వెళ్లాలని ముందే ప్లాన్ చేశారు. ఆరుగురి కోసం ముందే ఫ్లైట్ టిక్కెట్స్, హోటల్స్ బుక్ చేసుకున్నారు. తీరా కశ్మీర్‌లో ఉగ్రవాదులు సృష్టించిన నరమేధంతో అక్కడకు వెళ్లలేక టూర్ క్యాన్సిల్ చేసుకున్నారు.

కాకినాడలో రెవెన్యూశాఖకు చెందిన ఆరుగురు ఉద్యోగులు సెలవుపెట్టి కశ్మీర్‌కు బయలుదేరారు. తీరా ఢిల్లీలో విమానం దిగి ఉదయాన్నే కశ్మీర్‌కు బయలుదేరాలనుకునేలోగా ఉగ్రవాదుల దుశ్చర్యతో కాశ్మీర్ ట్రిప్ రద్దు చేసుకున్నారు. తిరుగు విమానం టికెట్లు ఈనెల 26వ తేదీకి బుక్ చేయడంతో చేసేదిలేక ఢిల్లీలోనే ఉండిపోయారు. మూడు రోజులుగా ఢిల్లీలోనే ఉండిపోయి చుట్టుపక్కల పర్యాటక ప్రాంతాల్లో తిరుగుతున్నారు.

కశ్మీర్‌లో ఉగ్రవాద దుశ్చర్య జరగడానికి ఐదు రోజుల ముందే అక్కడి నుంచి కాకినాడకు వచ్చిన కొందరు పర్యాటకులు జరిగిన సంఘటన తల్చుకుని బెంబేలెత్తిపోతున్నారు. తాము పహల్గాం నుంచి బైరసన్‌కు గుర్రాల్లో వెళ్లామని, అదే ప్రాంతంలో నరమేధం జరిగిందని తెలిసి ఒళ్లు జలదరించిందని కాకినాడ నగరానికి చెందిన కొందరు పర్యాటకులు వివరించారు.

కశ్మీర్‌లోయలోని పహల్గాంలో ఈనెల 22న 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్న నేపథ్యంలో కశ్మీర్‌లో ఉన్న పర్యాటకులు ప్రాణభయంతో తిరుగుముఖం పట్టారు. దీంతో చాలావరకు కశ్మీర్ ఖాళీ అయిపోయింది. మరో పక్క అక్కడకు సరదాగా వెళ్లాలని ముందే ప్లాన్ చేసుకున్న అనేక కుటుంబాలు ప్రయాణాన్ని రద్దు చేసుకుంటున్నాయి. ఈ వేసవిలో సరదాగా కశ్మీర్ వెళ్లడానికి ఉమ్మడి జిల్లాలో పలు కుటుంబాలు టూర్ ఏజెంట్లను సంప్రదించి నెల రోజులు ముందుగానే టికెట్లు బుక్ చేసుకున్నారు. ఇప్పుడు ఉగ్రవాదుల దుశ్చర్యతో కశ్మీర్‌కు వెళ్లాలనుకున్న పర్యాటకులు రద్దు చేసుకుంటున్నారు. దీంతో ఏజెంట్లు గగ్గోలు పెడుతున్నారు.

బుకింగ్‌లు రద్దు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల నుంచి దేశ, విదేశాల్లో వివిధ టూరిస్ట్ ప్రాంతాలకు వెళ్లే పర్యాటకుల కోసం 75 వరకు టూర్ అండ్ ట్రావెల్ ఏజెన్సీలున్నాయి. స్వదేశంలో ఏర్పాట్లకు 42 వరకు సర్వీసులు అందిస్తున్నాయి. ఈనెల, వచ్చే నెలలో కలిపి ఈ రెండు నగరాల నుంచి దాదాపు 170 వరకు వివిధ కుటుంబాలు, గ్రూపులు ఢిల్లీ, కశ్మీర్‌కు బుకింగ్‌లు చేసుకున్నాయి. కానీ ప్రస్తుతం అక్కడకు వెళ్లడం ప్రమాదంతో కూడుకున్నందున వీరంతా తమ పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు. కొందరైతే ఆన్‌లైన్‌లో సొంతంగా చేసుకున్న బుకింగ్‌లు రద్దు చేసుకుంటున్నట్టు కాకినాడ, రాజమహేంద్రవరానికి చెందిన రెండు టూర్ ఏజెన్సీలు వివరించాయి. ఉమ్మడి జిల్లాలో కశ్మీర్ టూర్‌కు టికెట్లు బుక్ చేసుకున్న పర్యాటకులకు హోటల్స్ బుకింగ్ రద్దుకు అంగీకరించగా, కొన్ని విమాన కంపెనీలు టికెట్ బుకింగ్ ఆప్షన్‌లో క్యాన్సిలేషన్ లేదేని తెగేసి చెబుతున్నాయి. కశ్మీర్ వెళ్లేవారంతా ఢిల్లీ నుంచే రైళ్లలోను, విమానాల్లోనూ వెళతారు. దీంతో కొందరు డబ్బులు వదిలేసుకుని పర్యటన రద్దు చేసుకోగా.. కొందరు పర్యాటకులైతే డబ్బులు వదులుకోలేక ఢిల్లీ వరకు వెళ్లి కొన్నిరోజులు ఉండేలా సిద్ధమవుతున్నారు. ఇలా కొందరు పర్యాటకులు ఈనెల 26, 27 తేదీల్లో పయనమవుతున్నట్టు రాజమహేంద్రవరానికి చెందిన ట్రావెల్ ఏజెన్సీ వివరించింది. ఇప్పటికే శ్రీనగర్‌లో ఉన్న పర్యాటకులు వెనక్కు రావడానికి విమానం టిక్కెట్లు బుక్ చేయాలని, లేదా ఢిల్లీదాకా తెలిసిన టూర్ ఏజెన్సీ వాహనాలు బుక్‌చేయాలని కోరుతున్నట్టు సమాచారం.

» ఉగ్రవాదుల దుశ్చర్య
» పర్యాటకుల్లో గుబులు
» పలు బుకింగ్‌లు రద్దు
» టూర్ ఏజెన్సీల గగ్గోలు
» కొంత మంది ఢిల్లీకి పయనం
» అక్కడ చిక్కిన టూరిస్ట్‌లు
» తిరిగి వచ్చేందుకు ఒత్తిడి
» ఖాళీ అవుతున్న కశ్మీరం

వేసవిలో వెళ్లేది ఇందుకే..

ఏప్రిల్‌లో మనకు ఎండలు మండిపోతుంటాయి. 38 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రత ఉంటుంది. కశ్మీర్‌లో పగటి ఉష్ణోగ్రత 5 నుంచి 13 డిగ్రీల వరకు ఉంటుంది. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అనేక చోట్ల మైనస్ 3 డిగ్రీలు ఉంటుంది. గురువారం కశ్మీర్‌లోని సోనామార్గ్‌లో రాత్రి 8 గంటలకు ఉష్ణోగ్రత రెండు డిగ్రీలు నమోదైంది. బుధవారం అయితే రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మైనస్ 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉగ్రవాద దుశ్చర్య జరిగిన పహల్గాంలోని బైసరన్‌లో గురువారం రాత్రి రెండు డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. కశ్మీర్‌లో అనేకచోట్ల పగటి ఉష్ణోగ్రతలు సైతం ఆరు నుంచి ఎనిమిది డిగ్రీలే ఉంటోంది. ప్రకృతి అందాలు, హిమాలయ సోయగాలు ఈ సమయంలో ఎంతగానో అలరిస్తాయి. దీంతో కశ్మీర్‌కు బుకింగ్‌లు ఎక్కువ ఉంటాయి.

కశ్మీర్‌కు ఇప్పుడే ఎందుకంటే..

జమ్ముకశ్మీర్ ఏప్రిల్ నుంచి మరింత అందంగా మారుతుంది. ప్రకృతి ప్రియులను ఆకర్షిస్తుంది. మార్చి మూడో వారం వరకు కశ్మీర్‌లోని శ్రీనగర్, పహల్గాం, గుల్మార్గ్, సోనామార్గ్, దాల్ లేక్ ప్రాంతాల్లో మంచు కురుస్తుంటుంది. మార్చి ఆఖరు నుంచి.. ఏప్రిల్ ఆరంభంలో మంచు కురవడం ఆగిపోయి వందల మీటర్ల ఎత్తులో పేరుకుపోయిన భారీ మంచు కొండలు కరగడం మొదలవుతాయి. ఈ సమయంలో హిమాలయాలు, దాల్ లేక్‌లో పడవ ప్రయాణం జీవితంలో మర్చిపోలేని అనుభూతి. అందుకే ఈ సమయంలో పర్యాటకులు దేశవ్యాప్తంగా కశ్మీర్‌కు పోటెత్తుతారు. ప్రతి ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఈ సీజన్‌లో కశ్మీర్‌కు గ్రూపు బుకింగ్‌లు ఎక్కువ ఉంటాయి.



ఏ రైలూ.. ఖాళీ లేదు..!

» రైళ్లన్నీ ఫుల్.. రిజర్వేషన్లు నిల్
» వేసవికి విహార యాత్ర ఎలా?
» తిరుపతికి డబుల్ డెక్కరే గతి
» బెంగళూరు..చెన్నైకి ఖాళీల్లేవ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వేసవి సెలవులు వచ్చేశాయి. ఏడాది అంతా చదువులతో కుస్తీ పట్టే పిల్లలు.. ఇంటి పట్టునే ఉంటూ కుటుంబం బాగోగులు చూసుకొనే గృహిణులు.. ఉదయం ఆఫీస్‌కి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరే ఉద్యోగులు.. కాస్త సేదతీరాలనుకొనే రోజులు ఏప్రిల్, మే నెలలు.. ఏడాదిలోని మిగతా నెలల్లో పిల్లలకు స్కూలు ఉండడంతో ఎక్కడికైనా వెనకడుగు వేస్తారు. వేసవిలో పిల్లలకు స్కూళ్ల సెలవులు ఇస్తారు కాబట్టి.. అలా ఎక్కడికైనా విహారయాత్రకు వెళదామని ప్లాన్ చేసుకుంటారు. ఏ టూర్‌లో అయినా రైలు ప్రయాణమే కీలకం. రెండు నెలల క్రితమే రిజర్వేషన్లు చేయించుకుంటే పర్వాలేదు. ఇప్పటికిప్పుడు బయలుదేరితే మాత్రం కష్టమే. రైళ్లలో ఇప్పటికే మే నెలాఖరు వరకూ స్లీపర్‌తోపాటు ఏసీ క్లాసుల రిజర్వేషన్లు నిండుకున్నాయి. వెయిటింగ్ లిస్టులోకి ఎప్పుడో వెళ్లిపోయాయి. ప్రస్తుతం ఏ రైలు చూసినా కిక్కిరిసి కనిపిస్తోంది.

- సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడిచే రైళ్ల నడిచే తేదీలను పొడిగించడం మినహా చెప్పుకోగ్గ స్థాయిలో ఈ ప్రాంతం వాళ్లకు ఈ వేసవి ప్రత్యేక రైళ్ల విషయంలో ఆ శాఖ దయ చూపలేదు. హైదరాబాద్‌కి వందే భారత్‌లు నడుస్తున్నా చార్జీలు సామాన్యుడు భరించలేనంతగా ఉన్న విషయం తెలిసిందే.
- వేసవిలో ముఖ్యంగా తిరుపతికి రద్దీ ఉంటుంది. కానీ శేషాద్రి ఎక్స్‌ప్రెస్ వెయిటింగ్ లిస్టు 100కి చేరగా, తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో టికెట్లే లేవు. దిబ్రూగఢ్, సంత్రాగచి, హౌరా నుంచి వచ్చే రైళ్లలో రిజర్వేషన్లు క్లోజ్ అయిపోయాయి. వారంలో మూడు రోజులు నడిచే డబుల్ డెక్కర్‌కి కొన్ని టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ రైలుకు మినహా ఏ రైలుకూ తిరుపతికి రిజర్వేషన్లు ఖాళీ లేవు.
- బెంగళూరు వెళ్లే వారికి ఇటు నుంచి అటు నుంచి సరైన రైళ్లు లేవు. హతియా- హౌరా -న్యూతిన్సుకియా, టాటా, భువనేశ్వర్ నుంచి వచ్చే రైళ్లు రాజమండ్రి గుండా వెళుతున్నాయి. అమృత్ భారత్ సోమవారం ఇటు నుంచి మంగళవారం అటు నుంచి ఉంది. కాకినాడ నుంచి బెంగళూరుకు ఉన్న శేషాద్రి మాత్రమే ఈ ప్రాంతం వాళ్లకు దిక్కు. భువనేశ్వర్ నుంచి వచ్చే హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ బుధవారం రాజమండ్రి వస్తుంది. ఈ రైలుకి 20 రోజులు ముందు టికెట్ చేయించుకుంటే రూ.2వేలు అవుతుంది. ముజఫర్‌పూర్, న్యూతి న్సూకియా, భువనేశ్వర్ నుంచి వారానికో సారి, గువాహటి నుంచి వారానికి మూడు సార్లు రైళ్లున్నా బోగీల్లో కాలుపెట్టలేం.
- చెన్నైకి టాటా, ధన్‌బాద్, పురూలియా, న్యూతిన్సూకియా, షాలిమార్(కోరమాండల్), హౌరా, భువనేశ్వర్ నుంచి రైళ్లు ఉన్నాయి. హౌరా- కన్యాకుమారి, భువనేశ్వర్-పుదుచ్చేరి, ముజఫర్ పూర్-జోలార్‌పెట్టై వరకూ వారానికోసారి, సిల్చార్- కోయంబత్తూరు, భువనేశ్వర్-చెన్నై, జసిధ్-తాంబరం(గురు), ఖరగ్‌పూర్-విల్లుపురం, భువనేశ్వర్-రామేశ్వరం, విశాఖ-చెన్నై (శుక్ర), హౌరా -తిరుచిరాపల్లి (సోమ,శుక్ర) గువాహటి నుంచి మూడు రోజులు జోలార్‌పేట్ వరకూ, షాలిమార్ -త్రివేండ్రం(మంగళ, బుధ) ఉన్నాయి. సంత్రాగచి-చెన్నై ఏసీ ఎక్స్‌ప్రెస్ బుధ, శని వారాల్లో నడుస్తోంది. వీటిలో బెర్తులు దొరకాలంటే అదృష్టాన్ని నమ్ముకోవాల్సిందే. భువనేశ్వర్, హౌరా, షాలిమార్ నుంచి వచ్చే రైళ్లలో అడుగుపెట్టడానికి వీలుండదు.

ఇంటర్ సిటీలు వేయాలి..

ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్, అసోం, బిహార్ నుంచి ఉపాధి పనుల నిమిత్తం కూలీలు పెద్ద సంఖ్యలో కేరళ, తమిళనాడు, కర్నాటక వెళుతుంటారు. వేసవిలో తిరుగు ప్రయాణమవుతారు. అందుకే చెన్నై, బెంగళూరు, అళప్పుజ, తిరువనంతపురం నుంచి సిల్చార్, న్యూతిన్సూకియా వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో ఖాళీ ఉండదు. ఈ క్రమంలో వేసవి సెలవులకు విహారయాత్రలకు వెళదామని అనుకున్న వారితోపాటు ఆస్పత్రి పనులపై చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వెళ్లేవాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కొత్తగా వారాంతపు, బైవీక్లీ రైళ్లు వేస్తున్నా ఈ ప్రాంతం వాసులకు ఉపయోగం ఉండడం లేదు. ఈ ప్రాంతం నుంచి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు వేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. వేసవిలో నైనా విశాఖ-విజయవాడ,విజయవాడ-చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విశాఖ- భువనేశ్వర్,రాజమండ్రి-విజయవాడ, విశాఖపట్నం ఇంటర్ సిటీలు నడపితే నాలుగు జిల్లాల ప్రయాణికుల తిప్పలు తగ్గే అవకాశం ఉంది.

ఉగ్రదాడిని అందరూ ఖండించాలి

» కాకినాడలో నిర్వహించిన శాంతి ర్యాలీలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, జనసేన శ్రేణులు

కాకినాడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్ పెహల్గంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి దారుణమని, దీన్ని అందరూ ఖండించాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. ఉగ్రదాడికి నిరసనగా జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గురువారం కాకినాడలో ఎంపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహించారు. జేఎన్‌టీయూ కళాశాల నుంచి భానుగుడి సెంటర్ వరకు జరిగిన ఈ ర్యాలీలో జనసైనికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సరదాగా గడిపేందుకు కశ్మీర్ వెళ్లిన పర్యాటకులపై పాకిస్థానీ టెర్రరిస్టులు నిర్ధాక్షణ్యంగా దాడి చేసి చంపడం హేయమైన చర్య అన్నారు. దీనికి గట్టి సమాధానం చెప్పేందుకు ప్రధాని నరేంద్రమోదీ సిద్ధంగా ఉన్నారన్నారు. దేశవ్యాప్తంగా హోంమంత్రి అమిత్‌షా,రాజ్‌నాథ్‌సింగ్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారన్నారు. పాకిస్థాన్ ఓ పనికిమాలిన దేశమని, ఇండియాలో చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తే ఆ దేశం ఉండదని అన్నారు. ఈ ర్యాలీలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, కాకినాడ సిటీ, రూరల్ జనసైనికులు పాల్గొన్నారు.

ఏలేరులో స్నానానికి దిగి.. అమ్మమ్మ, మనవడు మృతి



7

సత్యవతి, వీరమనోజ్ మృతదేహాలు

మూడు రోజులు సెలవులోకి కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ షాన్‌మోహన్ వ్యక్తిగత పనుల నిమిత్తం మూడు రోజులు సెలవులో ఉంటున్నారు. శుక్రవారం, శనివారం, ఆదివారాల్లో సెలవులో ఉంటారు. తిరిగి ఈనెల 28న విధుల్లోకి చేరతారు. ఇన్‌చార్జి కలెక్టర్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా వ్యవహరిస్తారు.

జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మూడో అడిషనల్ జిల్లా జడ్జిగా నూతనంగా నియమితులైన జస్టిస్ జి.ఆనందిని కాకినాడ కోర్టు కాంప్లెక్స్‌లోని ఆమె కార్యాలయంలో జేసీ రాహుల్‌మీనా, కాకినాడ కమిషనర్ భావన గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

కల సాకారం దిశగా..



పిఠాపురంలో 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కానున్న సామాజిక ఆరోగ్య కేంద్రం

» పిఠాపురంలో 100 పడకల ఏరియా ఆస్పత్రి
» కొత్తపల్లిలో టీటీడీ కల్యాణ మండపం
» గొల్లప్రోలు, చేబ్రోలులో ఆలయాల్లో పనులకు శంకుస్థాపనలు
» రూ.30కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
» మాట నిలబెట్టుకుంటూ వడివడిగా డిప్యూటీ సీఎం పవన్ అడుగులు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

దశాబ్దాల కల సాకారం అయ్యేందుకు అడుగులు పడుతున్నాయి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 100 పడకల ఏరియా ఆస్పత్రి భవనాలు, ఇతర పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టనున్నారు. టీటీడీ కల్యాణ మండపం, ఆలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తారు. రైతులకు వ్యవసాయ పనిము ట్లు, మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తారు.

పిఠాపురం నియోజకవర్గంతోపాటు పరిసరాల్లోని 120 గ్రామాలు, రెండు పట్టణాలకు వైద్యసేవలు అందించే ప్రభుత్వాస్పత్రి(సీహెచ్‌సీ)ని 30 పడకలనుంచి 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ నాలుగు దశాబ్దాలుగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏరియా ఆస్పత్రిగా తీర్చిదిద్దుతానని పవన్ ఎన్నికలకుముందు హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా పిఠాపురంలో 100 పడకల ఏరియా ఆస్పత్రి ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో అందుకు అవసరమైన నిధులు, పోస్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏరియా ఆస్పత్రికి అవసరమైన భవనాల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. ఇప్పుడు సీహెచ్‌సీని 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసే పనులకు పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు.

శంకుస్థాపనలు, పంపిణీలు ఇలా..

కొత్తపల్లిలో రూ.2కోట్లతో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. అక్కడే గొల్లప్రోలు పట్టణంలోని సీతారామస్వామి దేవస్థానంలో రూ.1.32కోట్ల వ్యయంతో చేపట్టే ప్రాకార మండపం నిర్మాణానికి, చేబ్రోలు సీతారామస్వామి ఆలయంలో రూ.48లక్షలతో నిర్మించే కాలక్షేమ మందిరం, రథశాల నిర్మాణ పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. పిఠాపురం అంబేడ్కర్ భవనంలో జరిగే కార్యక్రమంలో నియోజకవర్గంలో 3,456 మహిళలకు రూ.8.64కోట్లతో కుట్టుమిషన్ల పంపిణీకి శ్రీకారం చుడతారు. రూ.26లక్షల వ్యయంతో రైతులకు 2వేల టార్పాలిన్లు పంపిణీ చేయనున్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా 14 రోటవేటర్లు, 39 పవర్‌టిల్లర్లు, 50 స్ప్రేయర్లను రైతులకు అందజేస్తారు.

ప్రారంభోత్సవాలు ఇవీ

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలోనిపిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల పరిధిలో రూ.18.02 కోట్లతో నిర్మించిన 276 సీసీ రోడ్లు ప్రారంభోత్సవాలకు సంబంధించిన శిలాఫలకాలను ప్రభుత్వాస్పత్రి వేదికగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆవిష్కరిస్తారు. రూ.3.20 కోట్లతో నిర్మించిన ఏడు తారురోడ్లను, రూ.8.68కోట్లతో నిర్మించిన కాంపౌండ్ వాల్స్ డ్రైన్లు, డబ్ల్యూబీఎం రోడ్లు తదితర 56పనులను ప్రారంభిస్తారు. గ్రామాల్లో పలు రహదారులు సీసీ రోడ్లు, తారు రోడ్లుగా అభివృద్ధి చెందడంతో అధ్వాన రోడ్లతో ప్రజలు పడిన ఇబ్బందులు తీరాయి. త్వరలోనే గ్రామాల్లో నూరుశాతం సీసీ రోడ్లు నిర్మించాలనే లక్ష్యంతో అడుగులు పడుతున్నాయి.

సమకూరే సదుపాయాలు ఇవీ

ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంవల్ల 6-7లక్షలమంది ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రతి చిన్న వైద్యానికి కాకినాడ వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. భవనాలు పూర్తి కాగానే ఏరియా ఆస్పత్రిగా రూపాంతరం చెందిన అనంతరం అదనంగా 66 పోస్టులను భర్తీ చేస్తారు. ఇందులో స్పెషలిస్టు వైద్యులు సహా అన్ని రకాల వైద్యుల పోస్టులే 23 ఉన్నాయి. స్టాఫ్‌నర్సుల పోస్టులు ప్రస్తుతం ఆరు ఉండగా, ఈ సంఖ్య 24కి పెరగనుంది. వైద్యుల పోస్టులకు సంబంధించి జనరల్ మెడిసన్, సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్ ఎనస్థీషియా విభాగాల్లో ఒకటి వంతున సివిల్ సర్జన్ స్పెషలిస్టు పోస్టులు, ఒక సివిల్ సర్జన్ ఆర్‌ఎంవో, గైనకాలజీ, జనరల్ మెడిసన్ విభాగాల్లో డిప్యూటీ సివిల్ సర్జన్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ జనరల్ పోస్టులు మూడు, జనరల్ మెడిసన్, సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఎనస్థీషియా, ఈఎన్‌టీ, అప్తమాలజీ, డెర్మటాలజీ, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ, పాథాలజీ విభాగాల్లో ఒకటి వంతున సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, డిప్యూటీ డెంటల్ సర్జన్ పోస్టులు ఉండనున్నాయి. ఆయా విభాగాల స్పెషలిస్టుల వైద్యులతోపాటు సాధారణ వైద్యులు అందుబాటులోకి రానున్నారు. వీరికి అదనంగా నర్సింగ్ సూపరింటెండెంట్, హెడ్‌నర్సులతో సహా 30మంది సిబ్బందిని అదనంగా నియమిస్తారు. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, స్కానింగ్, ఎక్స్‌రే సహా ఇతర సదుపాయాలు కల్పిస్తారు.

నేడు పిఠాపురంలో.. డిప్యూటీ సీఎం పవన్ పర్యటన



6

» రచ్చబండలో ప్రజలతో ముఖాముఖి
» అభివృద్ధి పనులకు శ్రీకారం



పవన్‌కల్యాణ్ పాల్గొనే రచ్చబండ ప్రాంగణం

డిప్యూటీ సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

» అధికారులు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్




పిఠాపురంలో డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టరు షాన్‌మోహన్, జేసీ రాహుల్, ఎస్పీ బిందుమాధవ్

పిఠాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి, అంబేడ్కర్ కమ్యూనిటీహాలు, హెలిప్యాడ్, రచ్చబండ నిర్వహించేఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణను జేసీ రాహుల్‌మీనాతో కలిసి పరిశీలించారు. పర్యటన సందర్భంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సాధారణ ప్రజలకు ఇబ్బంది కలగకూడదని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి ఉన్నారు. పవన్ పర్యటించే ప్రాంతాలను ఎస్పీ బిందుమాధవ్ గురువారం రాత్రి పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. పవన్ పాల్గొనే కార్యక్రమాలవద్ద చేసిన ఏర్పాట్లను శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పరిశీలించారు.

అంతరిక్ష అనుభవంలోకి..

వెల్‌కం సునీత.. ఆకట్టుకున్న లఘుచిత్రం





ఆంధ్రజ్యోతి-అమలాపురం రూరల్

సునీతా విలియమ్స్.. ఆ పేరు తెలియనివారెవరూ ఉండరంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అంతరిక్ష పరిశోధనలకు వెళ్లిన సునీతా విలియమ్స్ ఎదుర్కొన్న ఇబ్బందులు.. తిరిగి భూమికి అడుగిడినప్పుడు ప్రతీ ఒక్కరు తమ ఇంటి ఆడబిడ్డ పుట్టింటికి వచ్చినంత ఆనందం అనుభవించారు. ఆ ధీర వనిత, అంతరిక్ష అనుభవాలను నేపథ్యంగా తీసుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్‌లోని సమనస గ్రామంలో ఉన్న శ్రీరామా పబ్లిక్ స్కూలు ప్రిన్సిపాల్ పురాణపండ లక్ష్మీగణేష్ తీసిన లఘుచిత్రం అందరినీ ఆకట్టుకుంటోంది. అదే పాఠశాలలో పది రోజులపాటు తీసిన లఘు చిత్రాన్ని ఆయనే స్వయంగా ఎడిటింగ్ చేయడానికి నెల రోజుల వ్యవధి పట్టింది. ప్రేక్షకులందరినీ అంతరిక్షంలోకి తీసుకువెళ్లిన అనుభూతి కలిగించారు. వెనుకభాగంలో ఏర్పాటుచేసిన గ్రీన్ మ్యాట్‌పై సీన్‌ల వారీగా లోకేషన్లు మారుస్తూ (గ్రాఫిక్ డిజైన్లతో) లఘుచిత్రాన్ని నిర్మించారు. అంతరిక్షాన్ని తెరపై ఆవిష్కరించడంతోపాటు పాత్రధారులందరికోసం ప్రత్యేక కాస్ట్యూమ్స్‌ను కొనుగోలు చేశారు. సునీతా విలియమ్స్ సాహస గాథపై ప్రిన్సిపాల్ పురాణపండ లక్ష్మీగణేష్ రచనా, దర్శకత్వంలో రూపొందించిన ఈ లఘుచిత్రం ఆహుతులందర్నీ ఎంతగానో ఆకట్టుకుంది. 30 నిమిషాల నిడివి గల సాహస గాథను వెల్కమ్ సునీత... అంటూ తెరపైకి ఎక్కించిన తీరు ఆద్యంతం ఆకట్టుకుంది. సునీతా విలియమ్స్ నాసా కేంద్రం నుంచి అంతరిక్షంలోకి వెళ్లినప్పటి నుంచి తిరిగి భూమిపైకి అడుగిడే వరకు పలు అంశాలను లఘుచిత్రంలో పొందుపరిచిన తీరు అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. సమనసలోని శ్రీరామా పబ్లిక్ స్కూలు వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం లఘుచిత్రాన్ని విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, గ్రామస్తులు తిలకించి లక్ష్మీగణేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. 2024 సంవత్సరంలో నాసా నుంచి అంతరిక్ష కేంద్రానికి బయలుదేరిన సునీత, విల్మోర్ సుమారు తొమ్మిది నెలలపాటు అంతరిక్షంలో చిక్కుకుని ధైర్యసాహసాలతో తిరిగి ప్రాణాలతో భూమి మీదకు వచ్చిన ఎన్నో ఘట్టాలను కళ్లకు కట్టినట్టుగా ప్రత్యేక గ్రాఫిక్స్‌తో తీశారు. సునీత విలియమ్స్ పాత్రలో పాఠశాల విద్యార్థిని టి.శరణ్య, విల్మోర్ పాత్రలో ఎస్.గుణశేఖర్, చీఫ్ సైంటిస్ట్ పాత్రలో వి.వినోద్‌తోపాటు ఇతర విద్యార్థులు అనేక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి రచనా, నిర్మాత, దర్శకత్వం, ఎడిటింగ్, గ్రాఫిక్స్‌ను లక్ష్మీగణేష్ నిర్వహించారు. ఈ లఘు చిత్ర ప్రదర్శనను ముఖ్య అతిథిగా హాజరైన అమలాపురం తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్ తిలకించి ప్రత్యేకంగా అభినందించారు.

లఘుచిత్రంలోని నాసా కేంద్రంలో ఘట్టాలు









కథ, దర్శకత్వం వహించిన లక్ష్మీగణేష్



నాసా కేంద్రంలో చర్చలు జరుపుతున్నట్టు తీసిన సీను

తరతరాల 'చుట్ట'రికం..!





కాకినాడ రామకృష్ణారావుపేటలో చుట్ట చుడుతున్న దృశ్యం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాలం మారుతోంది.. కాలానుగుణంగా జనాలు మారుతున్నారు. వారి అలవాట్లను మార్చుకుంటూ వస్తున్నారు. కాలగర్భంలో కొన్ని కలిసిపోతున్నా.. సంప్రదాయ పొగాకుతో తయారు చేసే చుట్లకు మాత్రం గిరాకీ తగ్గలేదు. రకరకాల సిగరెట్లు మార్కెట్లోకి వచ్చినా.. వీటి వినియోగం మాత్రం ఆగలేదు అనేందుకు ఈ చిత్రాలే నిదర్శనం.. అన్నింటా యంత్ర తంత్రమే సాగుతుండగా.. చుట్టల తయారీ మాత్రం చేతిలోనే సాగుతోంది. తరతరాలుగా కొందరు చుట్ల తయారీతోనే ఉపాధి పొందుతున్నారు. కాకినాడ నగరంలోని రామకృష్ణారావుపేటలో కొందరు ఇలా చుట్టలు చుడుతూ కనిపించారు. ఒకప్పుడు పావలాకు ఐదు చుట్టలు అమ్మితే.. ప్రస్తుతం ఒక చుట్ట ధర రూ.2కి చేరింది. ఒక్కో వ్యక్తి రోజుకి 500 వరకు చుట్టలు చుట్టి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇలా పలు కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి.

'సివిల్స్'లో మెరిసిన తాపేశ్వరం యువకుడు

- ఆలిండియా స్థాయిలో 333వ ర్యాంకు
- మూడో ప్రయత్నంలో విజయం సాధించిన పవన్



యండ్రు పవన్‌కుమార్

మండపేట,ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఫలితాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం తాపేశ్వరానికి చెందిన యండ్రు పవన్‌కుమార్ అల్‌ఇండియా స్థాయిలో 333వ ర్యాంకును సొంతం చేసుకున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆయన మొదటి నుంచి చదువులో రాణించేవారు. పవన్ విద్యాభ్యాసం 1నుంచి పదో తరగతి మండపేట పట్టణంలో సాగింది. ఇంటర్ విజయవాడలో చదువుకున్నారు. అనంతరం బెనారస్‌లో ఐఐటీ మెకానికల్ చేశారు. సివిల్స్‌లో రెండుసార్లు విఫలమైనప్పటికీ మూడో ప్రయత్నంలో 333వ ర్యాంకును సొంతం చేసుకున్నారు.తాను ఎప్పటికైనా ఐఏఎస్ కావాలన్న కోరిక ఉండేదని, ఇపుడుతనకు వచ్చిన ర్యాంకుకు ఐఆర్ఎస్ లేదా ఐఎఫ్ఎస్ రావచ్చని పవన్ తెలిపారు. ఆయన తండ్రి ఎరువులు వ్యాపారి. వీరిది వ్యవసాయ కుటుంబం. తమ కుమారుడు సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావడంపట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నివాళిగా..





కశ్మీర్‌లో ఉగ్రవాదుల దురాగతాలకు వ్యతిరేకంగా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం రాత్రి వైద్య విద్యార్థులు కొవ్వొత్తులతో అఖండ భారతదేశం ఆకృతిలో నిరసన తెలియజేస్తున్న దృశ్యం. అలాగే చింతూరులో హిందు, ముస్లింల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం - రాజానగరం/చింతూరు

నేడు పిఠాపురంలో..

డిప్యూటీ సీఎం పవన్ పర్యటన



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటనకు వచ్చిన పోలీసు బందోబస్తు


- రచ్చబండలో ప్రజలతో ముఖాముఖి
- అభివృద్ధి పనులకు శ్రీకారం
- పర్యటనకు భారీ బందోబస్తు

పిఠాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలో ఒక్క రోజు పర్యటన నిమిత్తం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శుక్రవారం రానున్నారు. ఈ పర్యటన నిమిత్తం భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శుక్రవారం ఉదయం విశాఖ నుంచి రాజమహేంద్రవరం ప్రత్యేక విమానంలో వస్తారు. అక్కడినుంచి ఉదయం 9.20గంటలకు పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకుని అక్కడ ఉదయం 9.30గంటల నుంచి 10.15 గంటల వరకూ నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారు. ఇందుకుగాను విస్తృత ఏర్పాట్లు చేశారు. అక్కడినుంచి మధ్యాహ్నం 11గంటలకు కొత్తపల్లి చేరుకుని అక్కడ టీటీడీ కల్యాణ మండపం నిర్మాణపనులకు భూమిపూజ నిర్వహిస్తారు. అక్కడినుంచే గొల్లప్రోలు, చేబ్రోలు సీతారామస్వామి దేవస్థానాల్లోని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు పిఠాపురం రథాలపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాలుకు చేరుకుని అక్కడ జరిగే టైలరింగ్ ఉచిత శిక్షణా తరగతుల్లో పాల్గొన్నవారికి కుట్టుమిషన్లు పంపిణీ చేస్తారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో యాంత్రీకరణ పథకం ద్వారా పరికరాలు, రైతులకు టార్పాలిన్లు అందజేస్తారు. మధ్యాహ్నం 12.35గంటలకు పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి చేరుకుని 100 పడకల ఆసుపత్రి అప్‌గ్రేడేషన్ పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడినుంచే నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు, సీసీ రోడ్లకు ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం 1.15 గంటలకు తిరిగి హెలికాప్టర్‌లో మంగళగిరికి మధ్యాహ్నం 2.20గంటలకు చేరుకుంటారు.


పర్యటనకు భారీ బందోబస్తు

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటనకు 350మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఒక ఏఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 17మంది సీఐలు, 35మంది ఎస్ఐలు, హెచ్‌సీలు, పీసీలు, మహిళాపోలీసులు 300మందిబందోబస్తు విధుల్లో ఉంటారు. వీరికి అదనంగా ఏఎస్ఎస్ పార్టీలు, రోప్ పార్టీలు ఉన్నాయి. వీరు గురువారంసాయంత్రానికే ఇక్కడకు చేరుకున్నారు.



అవగాహనతోనే మలేరియా దూరం

కంటికి కనీకనిపించని చిన్న దోమ ద్వారా అనేక విష జ్వరాలు సోకి అవి మరణం వరకు తీసుకెళ్లిన ఎన్నో సంఘటనలను చూశాము. అయితే ముందస్తు జాగ్రత్త చర్యలు, అవగాహన కార్యక్రమాలతో మలేరియా దరిచేరకుండా తరిమేయవచ్చని వైద్యులు చెప్తున్నారు.





జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అనాఫిలిస్ అనే దోమ కాటు ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుంది. ఇది సోకిన వ్యక్తికి రక్త మార్పిడి ద్వారా వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా వాంతులు, నిస్సత్తువ, తీవ్రమైన కండరాల నొప్పి, జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఈ జ్వరపీడితులకు సకాలంలో వైద్య చికిత్స అందించకపోతే తీవ్రమైన అనారోగ్యానికి దారితీస్తుంది. మలేరియా తీవ్రతరమైతే రక్తహీనత, విరోచనాలు, పొత్తుకడుపులో నొప్పి, శ్వాసకోశ ఇబ్బందులు, కండరాల నొప్పులు కనిపిస్తాయి. గత ఏడాది డబ్ల్యూహెచ్‌వో విడుదల చేసిన తాజా ప్రపంచ మలేరియా నివేదికలో మలేరియా కేసులు, మరణాలు గణనీయంగా తగ్గినట్టు వెల్లడించింది. కాకినాడ జిల్లావ్యాప్తంగా 2024లో కేవలం ఐదు మలేరియా కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఒక్క మరణం కూడా సంభవించలేదు.

ఒక్క కేసు కూడా నమోదు కాలేదు



డాక్టర్ విల్సన్, జిల్లా మలేరియా అధికారి

ఈ ఏడాది ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాకపోవడం ప్రజారోగ్య పరిరక్షణలో ఒక మంచి పరిణామం.

నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

గత ఏడాది 1,98,105 మలేరియా పరీక్షలు నిర్వహించగా కేవలం ఐదు మాత్రమే పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 65,662 పరీక్షలు నిర్వహించగా కేసులేమీ నమోదు కాలేదు. ప్రజలు, ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, స్వీయ పరిరక్షణ పాటించడం ద్వారానే ఇది సాధ్యమైంది. కాకినాడను మలేరియారహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుంది.

ఉడిమూడి వంతెన నిర్మాణంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు

పి.గన్నవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలో ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ ద్వారా నిర్మితమవుతున్న మేజర్ వంతెనలు, రహదారుల వివరాలతో కూడిన స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటిపెదపూడి వద్ద ఏఐబీ నిధులు రూ.49.50కోట్లతో నిర్మితమవుతున్న ఉడిమూడి-పెదపూడిలంక వంతెన నిర్మాణం పనులు, వరదల సమయంలో లంకగ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు డిప్యూటీ సీఎం పనన్‌కల్యాణ్‌కు వివరించారు. ఇది పంచాయతీరాజ్ ద్వారా జరుగుతున్న అతిపెద్ద వంతెనగా స్పష్టం చేశారు. దీంతో పవన్‌కల్యాణ్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపినట్లు రాంబాబు తెలిపారు. ప్రదర్శనలో ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్, ఈఎన్‌సీ బాలునాయక్ పాల్గొన్నారు.



మంగళగిరిలో పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈ

బీఎస్సీ నర్సింగ్ పరీక్షలు ప్రారంభం

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఎనిమిది కళాశాలలకు చెందిన 493 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 40 మంది గైర్హాజరయ్యారు. వచ్చే నెల 10వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఎగ్జామినేషన్స్ అబ్జర్వర్‌గా డాక్టర్ లావణ్య, చీఫ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శశి, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. ఇన్విజిలేటర్లుగా వివిధ ప్రాంతాలకు చెందిన 18 మంది ఉద్యోగులు పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్టు డాక్టర్ శశి తెలిపారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థినులు →





విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సమగ్ర శిక్షా ఏపీసీ వేణుగోపాలరావు

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా, స్పెషల్ ఒలింపిక్స్ భారత్ సంయుక్తంగా ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లిలో ప్రత్యేక అవసరాల (సీడబ్ల్యుఎస్ఎన్) విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో కాకినాడ జిల్లా నుంచి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. కాకినాడలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో గురువారం నిర్వహించిన అభినందన సభలో జాతీయ పోటీలకు ఎంపికైన జి.సురేష్‌కుమార్ (రన్నింగ్), కె.సత్యదుర్గ పెదరాజు (బోసే గేమ్), కె.ప్రేమ్‌కుమార్ (రన్నింగ్)లను అదనపు పథక సంచాలకుడు పి.వేణుగోపాలరావు అభినందించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందించి సత్కరించారు. ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ జిల్లా కో-ఆర్డినేటర్, సీఎంవో చామంతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలకు అరుదైన గుర్తింపు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మేధోసంపత్తి దినోత్సవం సందర్భంగా ఐపీ, సంగీతం-ఫీల్ ద బీట్ ఆఫ్ ఏపీ విభాగంలో ప్రతిష్టాత్మకమైన ఏపీఎస్‌సీహెచ్ఈ రాష్ట్రస్థాయి అవార్డును తమ కళాశాల దక్కించుకుందని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే తెలిపారు. స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కింద కళాశాలలోని ప్రతిభావంతులైన విద్యార్థులు రూపొందించిన అత్యుత్తమ కళాశాల ఆడియో విజువల్ ప్రదర్శనకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని ఆయన పేర్కొన్నారు.

ఏలేరులో స్నానానికి దిగి..

అమ్మమ్మ, మనవడు మృతి

● ఏలేశ్వరం మండలంలోని యర్రవరం ఏలేరు కాలువ వద్ద ఘటన
● మృతులది ప్రత్తిపాడులోని ఏగులమ్మ గుడి ప్రాంతం



ఏలేరులో స్నానాలకు దిగి మృతి చెందిన అమ్మమ్మ మనవడు



అరట్లకోట సత్యవతి, గోర్స వీరమనోజ్(ఫైల్)

ఏలేశ్వరం/ప్రత్తిపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా ప్రత్తిపాడుకు చెందిన అమ్మమ్మ, మనవడు బుధవారం ఏలేశ్వరం మండలంలోని యర్రవరం ఏలేరు కాలువలో దిగి ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందారు. ఇద్దరు మృతి చెందారన్న విషయం గురువారం ఉదయం తెలియడంతో ప్రత్తిపాడులో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ప్రత్తిపాడు ఏగులమ్మ గుడి సమీపంలో ఉంటున్న అరట్ల కోట సత్యవతి(50), గోర్స వీర మనోజ్(12) అమ్మమ్మ, మనవడు. వీరిద్దరూ పొద్దుపోయిన తర్వాత యర్రవరం ఏలేరునదిలో స్నానం ఆచరి ంచేందుకు ప్రత్తిపాడు నుంచి బయల్దేరి వెళ్లారు. ఏలేరు నది ఒడ్డున చెప్పులు వదిలి స్నానం చేసేందుకు దిగిన వీరు ఊబి ఉన్న ప్రాంతంలో దిగడంతో ప్రమాదవశాత్తూ గల్లంతయ్యారు. వీరి ఆచూకీ కోసం బంధువులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. గురువారం ఉదయం ఏలేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో 11గంటల సమయంలో ఏలేరు నది వెంబడి గాలింపు చర్యలు చేపట్టగా సత్యవతి, మనో జ్ మృతదేహాలు లభ్యమయ్యాయి. వాటిని ఏలేశ్వరం ఎస్‌ఐ రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. సత్యవతి అమ్మవారి ఆలయం వద్ద సేవ చేస్తూ ఉంటుందని భర్త నాగేశ్వరరావు తెలిపారు. మనోజ్ 5వ తరగతి చదువుతున్నట్లు తండ్రి నాగేశ్వరరావు తెలిపారు. బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రత్తిపాడులో విషాదఛాయలు

ప్రత్తిపాడులోని ఏగులమ్మగుడి సమీప ప్రాంతానికి చెందిన అరట్లకోట సత్యవతి, మనవడు గోర్స వీర మనోజ్ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వీరి మృతి సమాచారం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలు సత్యవతి, భర్త నాగేశ్వరరావుకు ముగ్గురు ఆడపిల్లలు. వీరిలో వెంకటరమణమ్మ, రాజుల దంపతుల కుమారుడు గోర్స వీర మనోజ్. అమ్మమ్మ చేరికలో ఉండడంతో బాలుడు ఏలేరు నది స్నానానికి తీసుకెళ్లి ప్రమాదవశాత్తూ మునిగిపోవడంతో గ్రామస్తులను తీవ్రంగా కలిచివేసింది. వేగలమ్మ ఉత్సవాలకు గురువారం పందిరి రాటవేసి శ్రీకారం చుట్టే సన్నాహాలు జరుగుతుండడంతో వీరు ఏలేరులో స్నానం ఆచరించడానికి వెళ్లి మృత్యువాత పడడం గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రాంతం కుటుంబీకుల రోదనలతో విషాదం అలుముకుంది.

రాజమహేంద్రవరంలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్

» రెండు ఎకరాల స్థల సేకరణకు నిర్ణయం
» ఈ హబ్‌తో పారిశ్రామికవేత్తల గుర్తింపు
» హబ్ సభ్యులతో కలెక్టర్ ప్రశాంతి తొలి సమావేశం



సమావేశంలో పారిశ్రామికవేత్తలు, అధికారులతో మాట్లాడుతున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం కేంద్రంగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్టీఐహెచ్) ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దీని కోసం రెండు ఎకరాల భూమిని కూడా సేకరించనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం ఆర్టీఐహెచ్ సభ్యులతో తొలి సమావేశం నిర్వహించారు. ఇందులో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు, గ్రీన్ కోర్, ఓఎన్జీసీ, గెయిల్, ఇతర ఇన్నోవేటివ్ ఏజెన్సీలు, ఎన్ఐటీఏ, జేఎన్‌టీయూ ఎక్స్‌పెర్ట్ టీమ్, పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ, ఇతర సమన్వయ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలనే సీఎం నారా చంద్రబాబునాయుడు ఆలోచనకు అనుగుణంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యాచరణ లక్ష్యంగా గుర్తించిన వ్యక్తులను పరిజ్ఞానాన్ని అందించి, ఆలోచనల నుంచి నూతన ఆవిష్కరణలు చేపట్టాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో రాజమహేంద్రవరం, విశాఖ, తిరుపతి, ఎన్టీఆర్ జిల్లా, అనంతపురం జిల్లాల్లో ఈ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో సరైన దిశా నిర్దేశం చేయడంతోపాటు వారికి తగిన నాలెడ్జి అందించాలన్నారు. బోర్డ్ కోర్ కమిటీ గవర్నింగ్ వ్యవస్థకు గ్రీన్‌కోర్ సీఈవో, ప్రమోటర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. సహ ప్రమోటర్‌గా ఓఎన్జీసీ, గెయిల్, అవంతి తదితరులు, ఎక్స్‌పెర్ట్ కమిటీ సభ్యులుగా జేఎన్‌టీయూ, జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సభ్యులు వ్యవహరిస్తారన్నారు. సాంకేతిక పురోగతి, మార్కెట్ మార్పులు, స్టార్టప్‌ల అభివృద్ధి, అవసరాల నుంచి ఉత్పన్నమయ్యే అవకాశాలను ఉపయోగించుకోవడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. జిల్లా పరిధిలో ఫుడ్, ఆక్వా, అగ్రికల్చర్, అగ్రి వ్యర్థాలు, పామ్ ఆయిల్, కోకో, పిప్పర్, పూలు, మొక్కలు ఆధారిత యూనిట్లు, సేవారంగం, జీడిపప్పు పరిశ్రమ తదితర అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ఎ.గోపాలకృష్ణ, ఎన్ఐటీఏ డైరెక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి, గ్రీన్‌కో సీఈవో పి.రాంబాబు, ఐటీయూ అండ్ సీ-ఓఎస్‌డీ ఆర్.దీప్తి, గెయిల్ అధికారి డి.ప్రభాకర్, ఓఎన్‌జీసీ అధికారి జి.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవనిధర్ రామన్, డీఆర్‌డీఏ వీడీ మూర్తి, ఆర్ఎంసీ నుంచి కొండలరావు, మెప్మా శ్రీదేవి పాల్గొన్నారు.

తుని మున్సిపాలిటీపై

టీడీపీ పాగాకు ముహూర్తం ఫిక్స్

● 28న ఎన్నిక ప్రక్రియ

తుని రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తుని మున్సిపాల్టీపై టీడీపీ పాగాకు ముహూర్తం ఫిక్స్ అయింది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 28న ఈరెండు పదవులకు ఎన్నిక లాంఛన ప్రాయమే. 30మంది సభ్యులుగల తుని మున్సిపాల్టీలో టీడీపీ సంఖ్యా బలం 17. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చైర్మన్, వైస్ చైర్మన్ల అభ్యర్థుల ఎంపికపై మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబుతో తేటగుంట క్యాంప్ కార్యాలయంలో సమావేశమయ్యారు. చైర్మన్‌గా నార్ల భువనేశ్వరి, వైస్‌చైర్మన్‌గా ఆచంట సురేష్ పేర్లపై కౌన్సిలర్లు సుముఖత వ్యక్తం చేశారు. ఈ మేరకు యనమలకు కౌన్సిలర్లు ఏకాభిప్రాయం తెలియజేశారు. పట్టణ నేతలకు దిశానిర్దేశం చేసిన యనమల రామకృష్ణుడు అందరూ సమిష్టి నిర్ణయంతో జయభేరి మోగించాలన్నారు. ఇన్‌చార్జ్ చైర్మన్ కుచ్చర్లపాటి రూపాదేవి, మాజీ చైర్మన్లు యినిగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, సత్యనారాయణ, సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, నార్ల రత్నాజీ, దంతులూరి శ్రీనివాసరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



యనమలతో సమావేశమైన తుని మున్సిపల్ కౌన్సిలర్లు

గంజాయితో నలుగురి అరెస్టు

● రెండు కిలోల గంజాయి, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం



రాయవరం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘువీర్

రాయవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తుల నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ తెలిపా రు. గురువారం రాయవరం పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా రాయవరం మండలం పసలపూడి శివారు బండిరేవు పుంత వద్ద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారంపై మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు ఆధ్వర్యంలో రాయవరం ఎస్‌ఐ డి.సురేష్‌బాబు దాడిచేసి బండిరేవు పుంతవద్ద ప్లాస్టిక్ కవర్లతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న రామచంద్రపురం పట్టణానికి చెందిన కొగరు రామతేజ, మణిపూడి శ్రీసాయి వెంకటేశ్వరరావు, పసలపూడి గ్రామానికి చెందిన చిటికెన కల్యాణవెంకట కుమార్, సత్తి దుర్గా ప్రసాదరెడ్డిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయి, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నలుగురు వ్యక్తులు చెడు వ్యసనాలకు బానిసై గంజాయి తాగడానికి అలవాటు పడటంతోపాటు ఈజీగా డబ్బు సంపాదించాలనే ఆశతో దారకొండ ఏజెన్సీ నుంచి కిలో గంజాయి సుమారు రెం డువేలకు కొనుగోలుచేసి రూ.10వేలకు విక్రయాలు సాగిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి కొనుగోలుచేసి అమ్మకాలు సాగించేందుకు తెచ్చిన గంజాయిని పంప కాలు చేసే సమయంలో నలుగురినీ అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు సాగుతుందని మరో నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు.

ధ్రువపత్రాల పరిశీలన

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వైద్య కారణాల కిం ద బదిలీలు కోరుకునే ఉపాధ్యాయులకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యా యులకు కాకినాడ జీజీహెచ్‌లో గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. 192మంది వైద్య ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. వారిని వివిధ విభాగాల వైద్యులు పరీక్షించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీఆర్ విఠల్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసన్, అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్, ఆర్ఎంవో డాక్టర్ లావణ్య పర్యవేక్షించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని

యువకుడి మృతి



లోవరాజు మృతదేహం

శంఖవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కాసేపట్లో ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో ఆనందంగా ఉండాల్సిన యువకుడిని మృత్యువు కబళించింది. ఆ ప్రమాదం యువకుడి ఇంట శోకాన్ని మిగిల్చింది. శంఖవరం మండలం వేళంగి పంచాయతీ పరిధి ధారమల్లాపురం గ్రామానికి చెందిన ఆవూరి లోవరాజు(22) గురువారం బైక్‌పై ఇంటినుంచి రౌతులపూడి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా ప్రత్తిపాడు మండలం కొత్త అచ్చింపేట సమీపంలో విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరొక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా తలకి బలమైన గాయాలవడంతో అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. దీనిపై అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు.

విద్యుదాఘాతంతో

దింపు కార్మికుడి మృతి




కోలా ధనరాజు (ఫైల్)

చాగల్లు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలంలోని చిక్కాలలో కొబ్బరి దింపు కార్మికుడు విద్యు దాఘాతంతో మృతి చెందినట్లు ఎస్‌ఐ కె.నరేంద్ర తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిడదవోలు మండలం తాడిమళ్లకు చెందిన కోలా ధనరాజు (22) తోటి కొబ్బరి కాయల దింపు కార్మికులతో కలిసి పనికి వెళ్లాడు. కొబ్బరి చెట్టు నుంచి కాయలు దించుతుండగా అతనే నరికిన కొబ్బరి ఆకు ప్రక్కన ఉన్న విద్యుత్ తీగలపై పడి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తోటి కార్మికులు అతనిని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయిన ట్లు వైద్యులు చెప్పారు. ఈ విషయమై మృతుడు అన్నయ్య శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతుడుకి ఇంకా వివాహం కాలేదు.

రైలు నుంచి జారిపడి

మహిళ మృతి



రైలు నుంచి జారిపడి మృతి చెందిన మహిళ

తునిరూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తుని రైల్వే పో లీస్‌స్టేషన్ పరిధిలో రైలు నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. రైల్వే ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకా రం.. నరసింగపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మహిళ రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన మహిళ వయస్సు 35ఏళ్లు ఉంటుందని, మృతురాలి వద్ద ఏ ఆధారాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతురాలు వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీసులకుగాని సంబంధిత ఫోన్ నెంబర్ 94906 19020గాని సంప్రదించాలని కోరారు.

బాలుడిని కిడ్నాప్ చేసిన వ్యక్తి అరెస్ట్



జి.వేమవరంలో కిడ్నాపర్‌ని అరెస్టు చేస్తున్న ఎస్‌ఐ

తాళ్లరేవు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం జి.వేమవరంలో బాలుడు ఫణివర్దన్‌ని కిడ్నాప్ చేసిన చొల్లంగిపేటకు చెందిన కుంది అబద్దాలును అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ గురువారం తెలిపారు. సదరు అయిన విల్లి కాళీ కృష్ణభగవాన్ గత 3 సంవత్సరాల క్రితం కుంది అబద్దాలు వద్ద రూ.1,20,000 అప్పుగా తీసుకున్నాడు. ఈ డబ్బులను రాబట్టేందుకు కుంది అబద్దాలు కాళీకృష్ణ భగవాన్ రెండవ కుమారుడు ఫణివర్దన్‌ను కిడ్నాప్ చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు ఫిర్యాదు చేశారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి విచారణ చేపట్టారు. ఫణివర్దన్‌ని కిడ్నాపర్ నుంచి రక్షించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కిడ్నాపర్‌ని అరెస్టుచేసి రిమాండ్‌కి పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేబ్రోలులో మళ్లీ డయేరియా

కొత్తగా పది కేసులు
ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ అధికంగా రోగులు



చేబ్రోలు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకి నాడజిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మళ్లీ డయేరియా జాడలు కనిపిస్తున్నాయి. పీహెచ్‌సీతో పా టు ప్రైవేటు ఆసుపత్రులకు వాంతులు, విరోచనాలతో చికిత్స పొందుతూ రోగులు అధికంగా వస్తున్నారు. చేబ్రోలు పీహెచ్‌సీలో ఐదుగురు రోగులు చికిత్స పొందారు. ఇంటింటా సర్వెలెన్స్‌లో మరో ఐదు కేసులను గుర్తించారు. వీరుగాక ప్రైవేటు ఆసుపత్రుల్లో పది మందికిపైగా రోగులు చికిత్స పొందుతున్నారు. డయేరియా పూర్తిగా అదుపులోకి వచ్చిందని డీఎంహెచ్‌వో ప్రకటించి 24 గంటలు గడవక ముందే మరలా డయేరియాతో రోగులు అధికంగా రావడం ఆందోళన కలిగిస్తోంది. డయేరియా ప్రబలడానికి అసలు కారణాన్ని అధికారులు గుర్తించక పోవడమే ప్రధానకారణంగా భావిస్తున్నారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

రూ.5లక్షల ఆస్తి నష్టం

ముమ్మిడివరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం ఠాణేలంక పంచాయతీ పరిధిలోని బలుసుల్లంకలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమై రూ.5లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది. ఈ ప్రమాదంలో చిన్నం ప్రసాదరావుకు చెందిన తాటాకిల్లు కాలి బూడిదైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి కొండబాబు తెలిపారు. వ్యవసాయ కూలీ పనులకు చిన్నం ప్రసాదరావు, అతని భార్య వెళ్లగా కుమారులు ఇరువురు తాపీ పనులకు వెళ్లిపోయారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో చుట్టుపక్కల వారు గుర్తించేసరికే మంటలు చుట్టుముట్టడంతో ప్రమాదంలో సర్వం కాలి బూడిదయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో బయటపడ్డారు. ప్రమాదంలో రూ.60వేలు నగదు, బంగారపు వస్తువులు, గ్యాస్, విద్యుత్ మీటరు, గృహోపకరణాలు మొత్తం ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. ముమ్మిడివరం ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి కేవీ మురళీకొండబాబు, నారాయణలతోపాటు సిబ్బంది పాల్గొని మంటలు అదుపు చేశారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నా ప్రాణాలకు ముప్పు ఉంది

● రక్షణ కల్పించండి
● సామర్లకోట పోలీసులకు ఫిర్యాదు

సామర్లకోట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పనసపాడు గ్రామంలో నివసిస్తూ ఫణి గ్యాసెస్ సంస్థలో పనిచేస్తున్న సజ్జా రాము అనే వ్యక్తిపై మరొక గ్యాస్ కంపెనీకి చెందిన అభి, అనిల్, గంగాధర్‌రావు, మహేష్ అనే నలుగురు వ్యక్తులు తన ఇంటికి వచ్చి తన అంతుచూస్తామని బెదిరించడంతో తన ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని సామర్లకోట పోలీసులకు గురువారం ఫిర్యాదుచేశారు. ఇక్కడ లోకల్‌గా ఉన్న గ్యాస్ కంపెనీలు నిర్వహిస్తున్న తమకు నాన్‌లోకల్ అయిన మోహనరావు కంపెనీ వ్యాపారాల వలన తమ వ్యాపారం కుంటుపడుతుందని పేర్కొంటూ తనను బెదిరించి నట్లు పోలీసులకు తెలిపారు. తన ప్రాణాలకు రక్షణ కల్పించి తనను బెదిరిస్తున్న వారి నుంచి తనకు శాశ్వత రక్షణ కల్పించాలని సీఐకు అందించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫణి గ్యాస్ కంపెనీ అధినేత మోహనరావు కూడా ఫిర్యాదు అందజేసిన వారిలో ఉన్నారు. కాగా ఆరోపణలకు గురైన వారిని స్టేషన్‌కు పిలిపించి సీఐ కౌన్సెలింగ్ నిర్వహించి ఎవరివ్యాపారాలు వారు చేసుకోవాలని సీఐ కృష్ణభగవాన్ హెచ్చరించారు.

యువతి అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని సీతంపేటకు చెందిన 20 ఏళ్ల యువతి ఈనెల 23వ తేదీ నుంచి కనిపించడంలేదని త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం సీతంపేటకు చెందిన 20 ఏళ్ల యువతి ఇంటి వద్ద ఉంటుంది, ఈ క్రమంలో ఇంటి నుంచి బుధవారం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈమేరకు ఆ యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పిఠాపురం పట్టణం అగ్రహారంలో నిర్వహిస్తున్న కబేళాకు తాళాలు వేస్తున్న మునిసిపల్ కమిషనరు కనకారావు, సిబ్బంది

అగ్రహారంలో కబేళా మూసివేత

● హైకోర్టు ఆదేశాలతో మునిసిపల్ అధికారుల చర్యలు

పిఠాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని అగ్రహారంలో కబేళాకు ఎట్టకేలకు తాళాలుపడ్డాయి. నివాస ప్రాంతాల మధ్య పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉన్న జంతు వధశాలను మూసివేయాలని కలెక్టర్, హైకోర్టు ఆదేశించినా మునిసిపల్ అధికారులు అమలు చేయట్లేదంటూ కాకినాడకు చెందిన యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్ ప్రతినిధి గోపాలరావు హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేశారు. రెండు రోజుల్లో కబేళాను మూసివేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఈ నేపథ్యంలో కమిషనర్ కనకారావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది గురువారం కబేళాకు తాళాలు వేసి దానిని మూసివేస్తున్నట్టు నోటీసులు అంటించారు.

ఇద్దరు పాత నేరస్తుల అరెస్టు

● 12 గ్రాముల బంగారం స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువు జీరో పాయింట్‌వద్ద ఇద్దరు పాత నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం.. దివాన్‌చెరువు గ్రామ సమీపంలో ఈనెల 10న ఒక మహిళ రోడ్డుపై నడిచి వెళుతుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలో బంగారు వస్తువులను లాక్కెల్లారు. ఈ సంఘటనలో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు. ఈ చెయిన్ స్నాచింగ్‌కు పాల్పడింది ఒడిస్సాకు చెందిన పాత నేరస్తుడు కె.సూర్యారావు, అల్లూరిజిల్లాకు చెందిన ఉమాశంకర్ అని పోలీసులు గుర్తించారు. వారిని గురువారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 12 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. కె. సూర్యరావు, ఉమాశంకర్‌లపై గంజాయి, చెయిన్ స్నాచింగ్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.


ప్రేమపేరుతో మోసం చేశాడని యువతి ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రీల్ 24(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం దేవీచౌక్ సమీపంలో ఎస్‌కే కోచింగ్ సెంటర్‌లో కాంపిటేటివ్ పరీక్షలకు శిక్షణ పొందుతున్న ఎస్.రాంబాబు అనే యువకుడు తనను వివాహం చేసుకుంటానని చెప్పి ప్రేమపేరుతో మోసం చేశాడని బాధిత యువతి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. దేవపల్లికి చెందిన 20 ఏళ్ల యువతి రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో ఉన్న ఎస్‌కే కోచింగ్ సెంటర్‌లో పోటీ పరీక్షలకు శిక్షణకోసం 2022 నుంచి వచ్చి వెళుతుంది. ఈ క్రమంలో విజయనగరానికి చెందిన రాంబాబుతో పరిచయం ఏర్పడింది. దీంతో తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి ప్రేమించాడని తన అవసరం తీరాక రాంబాబు పెళ్లి చేసుకోనని మొఖం చాటేశాడని నిలదీస్తే కులం పేరుతో అవమానించాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కుటుంబాల మధ్య

వివాదం

● నలుగురికి గాయాలు



గాయపడ్డ మల్లాడి చినవీర్రాజు

కాట్రేనికోన, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం మత్స్యకార గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో నలుగురు గాయపడ్డారు. పంచాయతీ పరిధిలోని కుళాయిలవద్ద నీరు పట్టుకుని ఇంటికి వెళుతున్న సమయంలో మహిళలు ఒకరిని ఒకరు దూషించుకోవడంతో ఇరు కుటుంబాల మధ్య గురువారం వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదం నేపథ్యంలో మల్లాడి చినవీర్రాజు, మల్లాడి లక్ష్మణ్ కుటుంబాలు కొట్లాటకు దిగాయి. ఈ కొట్లాటలో మల్లాడి చినవీర్రాజువర్గంలో చినవీర్రాజు, లక్ష్మణ్ వర్గంలో మల్లాడి ధర్మారావు, మల్లాడి ధనావతి, మల్లాడి లక్ష్మణ్ గాయపడినట్లు ఎస్‌ఐ అవినాష్ తెలిపారు. గాయపడిన వారు ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రేపు జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగి ఆసక్తి గల పురుషులు, మహిళలు సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 8639846568ను సంప్రదించాలన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్ల సంఘ ప్రతినిధులు

వచ్చే నెల 9 నుంచి శాంతి ప్రార్థనా మహోత్సవాలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో మే 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న శాంతి ప్రార్థనా మహోత్సవాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బిషప్ యెల్చూరి విద్యాసాగర్ పిలుపునిచ్చారు. శాంతినగర్‌లోని న్యూలైఫ్ క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్లో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మహోత్సవాల వాల్‌స్క్రీన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియా సమావేశంలో స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ ప్రతాప్‌సిన్హా, మిషన్ టు ది నేషన్ డైరెక్టర్ యెల్చూరి పాపారావు, సీటీసీ డైరెక్టర్ విలియమ్స్, సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తి రాజు మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగే శాంతి ప్రార్థనా మహోత్సవాలకు ముఖ్య అతిథిగా కారుణ్య డీమ్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పాల్ దినకరన్ విచ్చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవాధ్యక్షుడు జోసఫ్ బెన్నీ, రాజమండ్రి పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ టాటా విక్టర్, ఏబీసీసీ జనరల్ సెక్రటరీ స్టీఫెన్ ఆనంద్, బిషప్ విలియమ్స్, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు మోసా అబ్రహం, సీనియర్ పాస్టర్ జాన్ బెంజ్, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ జనరల్ సెక్రటరీ శీరం ఐజాక్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జంగా గగారిన్, పాస్టర్స్ ప్రతినిధులు మిస్సా విజయ్‌కుమార్, మోజెస్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శేషుబాబ్జీ

పిఠాపురంలో భవన నిర్మాణ కార్మికుల ధర్నా

పిఠాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించాలని, పెండింగులో ఉన్న క్లెయిమ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ ఏపీ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో పిఠాపురం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలో ప్రదర్శన జరిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దువ్వా శేషబాబ్జీ, చెక్కల రాజకుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ఇంకా ఎంత సమయం కావాలని ప్రశ్నించారు. పనులు లేక కార్మికులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. దేశంలో అమలవుతున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని కోరారు. అందోళనలో వివిధ సంఘాల నాయకులు కుంచే చిన్నా, దేగల సత్యనారాయణ, కరణం విశ్వనాథం, సత్తిబాబు, సత్యనారాయణ, సురేష్, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసాన్ని ముట్టడించి రాయబార కార్యక్రమం నిర్వహిస్తామని భవన నిర్మాణ కార్మికులు ముందుగా ప్రకటించారు. అయితే అధికారులు స్పందించి శుక్రవారం పిఠాపురం వచ్చే పవన్‌కల్యాణ్‌ను కలిసే ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ముట్టడి కార్యక్రమాన్ని వాయిదా వేశారు. పవన్‌ను కలిసిన అనంతరం తమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సెక్రటరీ-కరస్పాండెంట్ చిరంజీవినీకుమారి

'ఐడియల్'లో ప్లేస్‌మెంట్ డే సెలబ్రేషన్స్

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విజ్ఞానంతో పాటు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా నాణ్యమైన విద్యా బోధన అందిస్తూ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగాలు సాధించేలా కృషి చేస్తున్న అధ్యాపకుల సేవలు అభినందనీయమని ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, సెక్రటరీ-కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ప్లేస్‌మెంట్ డే సెలబ్రేషన్స్ సమావేశం నిర్వహించారు. 2021 బ్యాచ్ విద్యా సంవత్సరంలో 319 మందికి 305 ప్లేస్‌మెంట్స్ సాధించడంలో కీలక పాత్ర వహించిన అధ్యాపక బృందాన్ని అభినందించారు. ప్లేస్‌మెంట్స్ సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్ఎస్ మూర్తి, డైరెక్టర్ జీవీ కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్, ఏవో జీవీకే వర్మ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.


అందుకున్న కిట్లతో హాకీ క్రీడాకారులు

హాకీ క్రీడాకారులకు కిట్లు పంపిణీ

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో హాకీలో ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులకు రూ.3 లక్షలు విలువచేసే హాకీ స్టిక్స్, టర్ఫ్ షూస్, వార్మప్ షూస్, స్టాకిన్స్ కిట్లను పోసిడెక్స్ కంపెనీ స్పాన్సర్ చేసింది. గురువారం వాటిని జిల్లా క్రీడాధికారి శ్రీనివాస్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో హాకీ కోచ్ వి.రవిరాజ్, సానా సతీష్ ఫౌండేషన్ అధ్యక్షుడు హరీష్, క్లబ్ అధ్యక్షుడు బాబ్జీ, కార్యదర్శి గంగాధర్, జిల్లా సంఘ కార్యదర్శి నంబు శ్రీనివాసరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎల్.జార్జి, పీడీలు సూరిబాబు, పరశురాం, సురేష్, రాజు, నాగమణి, సునీల్, సుధారాణి, దుర్గాదేవి పాల్గొన్నారు.


ఉద్యోగాలు పొందిన పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

జాబ్‌మేళాలో పిఠాపురం విద్యార్థుల సత్తా

పిఠాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో నిర్వహించిన జాబ్‌మేళాకు పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ ద్వారా శిక్షణ పొందిన 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో 10 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి. గురువారం వారిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుభాషిణి, జేకేసీ కో-ఆర్డినేటర్ అధ్యాపకులు వీజే ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు అభినందించారు.



కాకినాడలో మాలమహానాడు నాయకుల కొవ్వొత్తుల ప్రదర్శన



పెద్దాపురంలో ప్రదర్శనలో పాల్గొన్న చిల్డ్రన్ క్లబ్, ఎస్ఎఫ్ఐ సభ్యులు

ఉగ్రవాదం నశించాలి

నినదించిన ప్రజలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అణచివేసేందుకు ఆయా ప్రభుత్వాలు నడుంకట్టాలని రాక్స్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ డిమాండ్ చేశారు. ఉగ్రవాదం నశించాలని గురువారం రాత్రి కలెక్టరేట్ నుంచి జిల్లా పరిషత్ సెంటరు వరకు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రవాదం నశించాలని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని నినాదాలు చేశారు. పహల్గాంలో టెర్రరిస్టుల దాడిలో మృతి చెందిన టూరిస్టులకు శ్రద్ధాంజలి ఘటించారు. దళిత నాయకులు డోకుబుర్ర భద్రం మాస్టారు, చిన్నం వెంకటేశ్వరరావు, వరసాల జాన్‌ప్రభాకర్, కొచ్చర్ల సురేష్‌ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో ఉగ్ర దాడికి నిరసనగా జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్ర దాడిలో హతమైన పర్యాటకులకు నివాళులర్పించారు. ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు. పిఠాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులు మృతులకు నివాళులు అర్పించారు. క్రీడా మైదానంలో కొవ్వొత్తులతో మృతుల కుటుంబాలకు సంఘీభావం తెలిపారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద దాడులను ఖండిస్తూ పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ), ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఉగ్ర వాదం నశించాలి, ఉగ్ర దాడులను ఖండించాలని నినాదాలతో హోరెత్తించారు. పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్, బుద్దా శ్రీనివాస్, కూనిరెడ్డి అరుణ, అమృత, మణికంఠ, రవికుమార్, దారపురెడ్డి క్రాంతికుమార్, దారపురెడ్డి కృష్ణ, పెంటయ్య పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): ప్రజా సంఘాల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం నుంచి సంతపేట సెంటరు వరకు కొవ్వొత్తులతో ర్యాలీ జరిపారు. ఉగ్రవాదం నశించాలని నినాదాలు చేశారు. ప్రజా సంఘాల నాయకులు వడ్డి ఏడుకొండలు, వల్లు రాజబాబు, ప్రసాద్‌బాబు, నూకరాజు, ఈశ్వరీబాయి తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ హరిప్రసాద్, శ్రీనివాసరావు


తాళ్లరేవులో ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

మెడికవర్ ఆసుపత్రిలో ఉమెన్ చైల్డ్ వింగ్

సామర్లకోట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ఆసుపత్రిలో అధునాతన సదుపాయాలతో ఏర్పాటుచేసిన ఉమెన్ చైల్డ్ వింగ్‌ను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) గురువారం ప్రారంభించారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ శుభాకరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పంతం సందీప్, డాక్టర్ లక్ష్మీప్రవీణ, డాక్టర్ కస్తూరిబాయి, డాక్టర్ శ్రావణిసాక్షి, డాక్టర్ సుజనా నిమ్మకాయల, డాక్టర్ ఉప్పల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ హరిప్రసాద్

కల్యాణ మండపం నిర్మాణానికి నేడు శంకుస్థాపన

కొత్తపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడలోని చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో కల్యాణ మండపం నిర్మాణానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. ఆ ప్రాంతాన్ని ఎమ్మెల్సీ హరిప్రసాద్ గురువారం పరిశీలించి స్థానిక పెద్దలతో మాట్లాడారు. ఆయన వెంట జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, వైద్య విభాగం ప్రతినిధి డాక్టర్ జ్యోతుల శ్రీనివాసరావు వున్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న కౌడా చైర్మన్ బాబు

చలివేంద్రం ప్రారంభం

పెద్దాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) గురువారం ప్రారంభించారు. బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు, జనసేన నాయకులు కఠారి శ్రీనివాసరావు, తమనార లక్ష్మణ్‌దివాకర్, శ్రీరామ్ పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు ఎంపీ సతీష్ అభినందన

కాకినాడ సిటీ/సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో టాపర్లను రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ఫోనులో అభినందించారు. నూరు శాతం మార్కులు సాధించిన యాళ్ల నేహాంజని, గురుకుల పాఠశాలల్లో ఉమ్మడి జిల్లాల్లో తృతీయ స్థానం సాధించిన పి.వెంకటాపురం గురుకులం విద్యార్థిని సుచిత్రలను గురువారం ఎంపీ కార్యాలయ ప్రతినిధులు సత్కరించి బహుమతులు అందజేశారు. కార్యాలయ ఇన్‌చార్జి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు మోకా లక్ష్మణమూర్తి, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ పాల్గొన్నారు. నేహాంజని ఘనత తనకు గర్వంగా ఉందని ఎంపీ సతీష్‌బాబు ఫోనలో చెప్పారు. ఆమె ఉన్నత చదువులకు ఎటువంటి సహాయం కావాలన్నా సిద్ధంగా ఉన్నానని ఎంపీ భరోసా ఇవ్వడంపై నేహాంజని తండ్రి శ్రీనివాసరావు ఆనందం వ్యక్తం చేశారు. గురుకులం ప్రిన్సిపాల్ సుశీల, ఉపాధ్యాయులను మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు సత్కరించి అభినందించారు.


గురుకులం విద్యార్థి సుచిత్రను అభినందిస్తున్న ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి లక్ష్మణమూర్తి

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

సామర్లకోట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో కె.హిమ మహేశ్వరి అధ్యక్షతన పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాధవపట్నం, పనసపాడు, జి.మేడపాడు, అచ్చంపేట, ఉండూరు పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఎంపీపీ సత్తిబాబు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మాధవపట్నం పంచాయతీ ఆవరణలో పారిశుధ్య సిబ్బందిని గ్రామ ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు సత్కరించారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు ఎంపీడీవో వి.రవికుమార్, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ హరికృష్ణ సత్యరెడ్డి, పరిపాలనాధికారి ఎ.చలమయ్య, ఏపీవో కొండలరావు, జూనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, విద్యా శాఖ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


సామర్లకోట మండలం మాధవపట్నం పంచాయతీలో పారిశుధ్య సిబ్బందికి సన్మానం

గ్రామ సభ సమాచారం చెప్పరా!

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామసభ నిర్వహిస్తున్న సమాచారం తమకు ఇవ్వకపోవడంపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఆ సమయంలో టీడీపీ అధ్యక్షుడు ఓరుగంటి వీరబాబు, పలువురు నాయకులు వచ్చారు. తమకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని పంచాయతీ కార్యదర్శి రాజుని నిలదీశారు. కూటమిలో జనసేనతో పాటు టీడీపీ, బీజేపీ కూడా ఉన్నాయని గుర్తుంచుకోవాలని సూచించారు. తమకు సమాచారం చెప్పవద్దని ఎవరైనా చెప్పారా అని ప్రశ్నించారు. ఉద్యోగులు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. వీరబాబు వెంట నాయకులు నేమాల బాబీ, చల్లా నానాజీ, మట్టల నాగేంద్ర వున్నారు.


పంచాయతీ కార్యదర్శి రాజుని నిలదీస్తున్న టీడీపీ నాయకులు

అమ్మ, నాన్న స్ఫూర్తితో డాక్టర్ అవుతా: ఐశ్వర్య



సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఇంద్రపాలేనికి చెందిన మాచవరపు ఐశ్వర్య 591 మార్కులు సాధించింది. గంగరాజునగర్‌లోని ఆదిత్య టాలెంట్ స్కూల్లో పదో తరగతి చదివిన ఈమె తండ్రి డాక్టర్ వెంకటేశ్వరరావు పీడియాట్రిషియన్‌గా, తల్లి డాక్టర్ సునీత రేడియాలజిస్ట్‌గా కాకినాడ జీజీహెచ్‌లో వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. తల్లిదండ్రుల స్ఫూర్తి, ప్రోత్సాహంతో భవిష్యత్తులో పేదలకు వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో డాక్టర్ అవుతానని ఐశ్వర్య చెప్పింది,

ముగిసిన ఇంట్రామ్యూరల్ గేమ్స్, స్పోర్ట్స్

గండేపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో 2025కి సంబంధించి ఇంట్రామ్యూరల్ గేమ్స్, స్పోర్ట్స్ ముగింపు ఘనంగా జరిగింది. బాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, చెస్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంజరం విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయభాస్కర్ గురువారం తెలిపారు. ఇంజరం, సుంకరపాలెం, లచ్చిపాలెం, పిల్లంక, గోవలంక, కోలంకల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

రేపు గ్రామ దేవతల జాతర

కొత్తపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకతిప్ప, కొండెవరంల్లో శనివారం గ్రామ దేవతల జాతరలు జరగనున్నాయి. వాకతిప్ప గ్రామ దేవత ఆదిలక్ష్మి తల్లి, కొండెవరం గ్రామ దేవత పెద్దింటమ్మ తల్లి జాతర్లను ఘనంగా నిర్వహించేందుకు కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సిమెంటు రోడ్లు ప్రారంభం

తాళ్లరేవు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలపల్లి, ఇంజరం గ్రామాల్లో ఉపాధి హామీ, సమగ్ర శిక్షా నిధులు రూ.1.86 కోట్లతో నిర్మించిన సిమెంటు రోడ్లను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వేగేశ్న భాస్కరరాజు, సర్పంచ్ చిట్టూరి నాగమణి, ఎంపీటీసీ దంగేటి సత్తిబాబు, వస్కారెడ్డి, గంటా గోపి, కలికిమూర్తి, కట్టా త్రిమూర్తులు, పిల్లి సత్తిబాబు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దీక్ష

గొల్లప్రోలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సేవా సమితి ప్రతినిధి ఉలవశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం దీక్షలు చేపట్టారు. సంఘం ప్రధాన కార్యదర్శి మాదేపల్లి ఈశ్వరరావు, బీవీవీ సత్యనారాయణ, పి.అప్పారావు, జి.రామకృష్ణ, దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



వేణుగోపాల్ అందుకున్న ప్రశంసాపత్రం

ఈటీసీ ప్రిన్సిపాల్‌కు ప్రశంస

సామర్లకోట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆర్జీఎస్ఏ శిక్షణ తరగతులకు కార్యాచరణ రూపొందించడంలో చూపిన ప్రత్యేక కృషికి సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జుత్తిగ వేణుగోపాల్‌కు రాష్ట్రస్థాయిలో గౌరవ పురస్కారం లభించింది. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం అమరావతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన

సామర్లకోట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మాధవపట్నం జమునానగర్ కాలనీ వద్ద మురుగు కాలువపై సుమారు రూ.40లక్షల వ్యయంతో డ్వామా నిధులతో చేపట్టిన వంతెన నిర్మాణాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గురువారం పరిశీలించారు. పనులను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. టీడీపీ గ్రామ నాయకుడు పెంకే వెంకటేష్ పాల్గొన్నారు.

వంద కిలోల నల్లబెల్లం పట్టివేత

రౌతులపూడి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎస్.పైడిపాలలో తుని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు సారా వ్యాపారులపై దాడి చేశారు. ఈ దాడిలో 50 లీటర్లు సారా, 100 కిలోల నల్లబెల్లం, ద్విచక్రవాహనం సీజ్ చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌హెచ్‌వో పట్టాభి చౌదరి తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రేపు గ్రామ దేవతల జాతర

కొత్తపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకతిప్ప, కొండెవరంల్లో శనివారం గ్రామ దేవతల జాతరలు జరగనున్నాయి. వాటి ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తిచేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే శిరీషదేవి


ఉర్లకులపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రాజవొమ్మంగి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజల సంక్షేమం, అభివృద్ధికే ప్రాధాన్యం ఇస్తున్నామని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. గురువారం మండలంలోని రేవటిపాలెం, ఉర్లకులపాడు, జి.శరభవరం, మేలినవారి వీధి, మారేడుబాక, బలిజపాడు, మద్దిబందల, పెద్దరెల్లంగిపాడు గ్రామాలలో జల్‌జీవన్‌మిషన్ పనులకు ఎమ్మెల్యే శిరీషదేవి శంకుస్థాపన చేశారు. మంచి నీరు లేని గ్రామాలను గుర్తించి ఆ గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి మంచినీరు అందేలా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే ప్రజలకు తెలిపారు. ఉర్లకులపాడు గ్రామంలో ప్రజలతో ఎమ్మెల్యే ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ గృహనిర్మాణాలకు సంబంధించిన లబ్ధిదారులకు గృహనిర్మాణ మంజూరు పత్రాలు అందజేశారు. మడేరు ఆనకట్ట, దోనెలపాలెం, ఉర్లాకులపాడు గ్రామాల్లో ఇరిగేషన్ ద్వారా పూడికతీత పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు, లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు,టీడీపీ అరకు పార్లమెంటు ఉపాధ్యక్షుడుదంతులూరి శివరామచంద్రరాజు, గణజాల తాతారావు, జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరావు ఉన్నారు.

ఉగ్రవాదాన్ని అణచివేయాలి



అడ్డతీగలలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నేతలు

చింతూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అణచివేయాలని చింతూరు ప్రజలు నినాదాలు చేశారు. పహల్గాంలో ఉగ్రవాదులు అమాయకులపై చేసిన దాడిని నిరసిస్తూ గురువారంరాత్రి చింతూరులో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. చింతూరు యువత నేతృత్వంలో చేపట్టిన నిరసన ర్యాలీకి ప్రజలు, మత పెద్దలు, రాజకీయ నాయకులు పెద్దఎత్తున తరలి వచ్చారు. దాడులకు పాల్పడ్డ వారిని ఆ మేరకు సూత్రదారులను పసిగట్టి కఠినంగా శిక్షించాలని వారంతా ముక్త కంఠంతో కోరారు. కార్యక్రమంలో చింతూరు యువత, మత పెద్దలు, రాజకీయ నాయకులు, వ్యాపారులు, సాధారణ ప్రజలు పాల్గొన్నారు.

అడ్డతీగలలో కొవ్వొత్తుల ర్యాలీ

అడ్డతీగల: కాశ్మీర్‌లో హిందువులపై ఉగ్రదాడిని నిరసిస్తూ అడ్డతీగలలో కూటమి నేతల ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన రహదారిలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులైన వారి ఆత్మశాంతికి మౌనం పాటించారు. అనంతరం దేవి సెం టర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రత్యే కించి హిందూ మతస్తులపై దాడి చేయడం దుర్మార్గమన్నారు.కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వాలి

●ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం

రంపచోడవరం, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి): మన్యం జిల్లాలో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉచిత కోచింగ్, పరీక్ష ఫీజును ఐటీడీఏ ద్వారా చెల్లించేలా చర్యలు చేపట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం డివిజన్ కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మార్క్స్-ఏంగెల్స్ భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏఐకేఎంఎస్ ఉపాధ్యక్షుడు ఐ.వీ.రమణ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. అలాగే ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో అల్లూరి జిల్లా చివరిస్థానంలో ఉందని, వచ్చే విద్యాసంవత్సరంలోనైనా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అల్లూరి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిచేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు పాలిసెట్, ఎంసెట్, నీట్ తదితర ప్రవేశాలకు ప్రత్యేక కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు లక్ష్మణ్‌రెడ్డి, నాగరాజు, ప్రసాద్‌దొర, రాజ్‌కుమార్, సంధ్య, సరస్వతి పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు

● టీడీపీ నాయకుడు కరకా ప్రేమకిరణ్

మోతుగూడెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందించాలనే సంకల్పంతో ఐఐటీలకు దీటుగా ఐఐఐటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ వాటి భర్తీలో తీవ్రజాప్యం జరుగుతుండటంతో పిల్లలు ఐఐటీలో సీట్ వస్తుందో, రాదో, ఇంటర్మీడియట్ కాలేజీలో ప్రవేశం పొందాలో లేదా తెలియక అయోమయస్థితిలో పడిపోతున్నారు. అల్లూరి జిల్లా డొంకరాయి గ్రామానికి చెందిన టీడీపీ నాయ కుడు కరకా ప్రేమకిరణ్ ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా మంత్రి నారా లోకేష్ దృష్టికి గత ఏడాది అక్టోబరులో తీసుకుని వెళ్లగా, ఇకపై అటువంటి జాప్యాలు జరగవు అని మంత్రి కార్యాలయం నుంచి హామీ వచ్చింది.

కార్యకర్తలకు అండగా టీడీపీ

● మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పరామర్శ


పెదకొండలో టీడీపీ నాయకుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీష, తదితరులు

రంపచోడవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు, వారి కుటుంబాలకు తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. రంపచోడవరం మండలంలో పెదకొండకు చెందిన టీడీపీ సీనియర్ గిరిజన నాయకుడు, మాజీ సర్పంచ్ పల్లాల సోమిరెడ్డి కుటుంబాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూ రమేష్‌లు పరామర్శించారు. ఇటీవల సోమిరెడ్డి కుమారుడు తెలుగుదేశం కార్యకర్త బాబూరావురెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలముకుంది. దీంతో ఆ కుటుంబాన్ని ఓదర్చడానికి ఎమ్మె ల్యే శిరషాదేవి, మాజీ ఎమ్మెల్యే బాబూ రమేష్‌లు తమ పార్టీ నాయకులతో వెళ్లారు. మృతుడు బాబూరావు చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. నాయకులు అడబాల బాపిరాజు, పండా చెల్లన్నదొర, రవిబాబు, కె.కొండబాబు, బొజ్జిరెడ్డి, గణపతి రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

అడ్డతీగల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్క రించుకొని ఆశాఖ మొక్కల నాటే కార్యక్ర మానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి స్టేట్ ఆర్గనైజేషన్ కార్యదర్శి పి.శ్రీనువాసు ఆధ్వర్యంలో తొలుత పీఆర్ డిప్యూటీ ఇంజ నీర్ వెంకట్‌రామన్ మొక్కలను నాటారు. అనంతరం ఏజెన్సీ అన్ని మండలాల్లో ఆయా సచివాలయ సిబ్బంది వారి సచివాలయాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ సభ్యులు విజయ్‌బాబు, సమీర్‌శర్మ, రవికిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని రంపచోడవరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో డీఈ పి.వెంకటరమణ మొక్కను నాటారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమీర్, చందు, రామకృష్ణ, సన్నీ, రవితేజ, సువర్ణ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఇంజనీరింగ్ అధికారులు



కార్యాలయ ఆవరణలో మొక్కను నాటుతున్న డీఈ వెంకటరమణ





కత్తిపూడిలో సంతాప దీక్షను నిర్వహిస్తున్న జనసేన శ్రేణులు. ప్రత్తిపాడులో సంతాపం తెలుపుతున్న వైసీపీ నాయకులు

భారతీయులపై ఉగ్రదాడి అమానుషం

జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్

శంఖవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పెహల్గాంలో ఉగ్రవాదుల దాడి అమానుషమని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్(బాబి) అన్నారు. ఉగ్రదాడికి నిరసనగా గురువారం ఆయన ఆధ్వర్యంలో కత్తిపూడిలో సంతాపదీక్ష నిర్వహించారు. దీనికి జిల్లా జనసేన అధ్యక్షుడు, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు కరణం సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షుడు గాబు సుభాష్, పెంటకోట మోహన్, మేకల కృష్ణ, యర్రంశెట్టి బాబ్జీ, ఇందన సత్తివీర్రాజు, తలపంటి బుజ్జి, గౌతు లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి నిరసిస్తూ గురువారం రాత్రి ప్రత్తిపాడులో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జడ్పీటీసీ బెహరా రాజేశ్వరి పాల్గొన్నారు. ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజుసెంటర్‌లో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవ్ సత్తిరాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గురువారం మానవహారం నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు ఉగ్రదాడిలో బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన వారికి సత్కారం

అన్నవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులతో ప్రతిభ కనబరిచిన దేవస్థానం హైస్కూల్ విద్యార్థులను ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ గురువారం అభినందించి వారికి స్వామివారి కండువా, ప్రసాదాలు అందజేశారు. కొండ్ర జీవితాదేవి 540 మార్కులు, సానపల్లి లోహిత 498 మార్కులు, పంచదార్ల అపర్ణ 469 మార్కులతో మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. ప్రధానోపాధ్యాయులు అల్లాడ వెంకటేశ్వరరావు, ప్రసాద్ ఉన్నారు.


కాలువను శుభ్రం చేస్తున్న గ్రామస్తుడు

గ్రామస్తులే పారిశుధ్య కార్మికులు

శంఖవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కత్తిపూడిలో అపారిశుధ్యం గురించి పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో గ్రామస్తులే కార్మికుల అవతారం ఎత్తి పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. కత్తిపూడి బంకు సెంటర్లో గురువారం ప్రజలు పారిశుధ్య పనులు నిర్వహిస్తూ ఇలా కనిపించారు.


ఏలేశ్వరంలో మండల టాపర్‌ను అభినందిస్తున్న ఎంపీపీ

విద్యార్థులకు అభినందనలు

ఏలేశ్వరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన మండల టాపర్స్ కొప్పుల శ్రీరామ్, వంకాయల హరిప్రియలకు ఎంపీపీ బుజ్జి, ఎంఈవో అబ్బాయి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి అభినందించారు. కరస్పాండెంట్ తిరగటి విజయబాబు, ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, తిరగటి వీరన్న పాల్గొన్నారు.

ముద్రగడ గిరి పరామర్శ

రౌతులపూడి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉపాధ్యాయుడు కుటుంబాన్ని వైసీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ ముద్రగడ గిరి పరామర్శించారు. ఇటీవల విశ్రాంతి ఉపాధ్యాయుడు వాసిరెడ్డి కొండలరావు (బొజ్జ మాస్టారు) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుమారుడు లాయర్ వాసిరెడ్డి శివను పరామర్శించారు. గుమ్మరేగులలో ప్రమాదవశాత్తూ ఏలేరు కాలువలో పడి మృతి చెందిన యువకుడు జయబాబు కటుంబసభ్యులను పరామర్శించారు.

ముగిసిన ఇంట్రామ్యూరల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్


అవార్డులు ప్రదానం చేస్తున్న దృశ్యం

గండేపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య విశ్వ విద్యాలయంలో 2025కి సంబంధించి ఇంట్రామ్యూరల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇంట్రమ్యూరల్స్ సంబంధించి బాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, చెస్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఖోఖో పోటీలో మొత్తం పది టీమ్స్ పాల్గొనగా పురుషుల విభాగంలో మొదటిస్థానం ఈసీఈ థర్డ్ ఇయర్ జట్టు, రెండోస్థానం ఏఐఎంఎల్ ఫస్ట్ ఇయర్స్ జట్టు సాధించాయి. మహిళా విభాగంలో ఏఐఎంఎల్ ఫస్ట్ ఇయర్ మొదటిస్థానం, డేటా సైన్స్ ఫస్ట్ ఇయర్ రెండోస్థానం, కబడ్డీలో మెకానికల్ థర్డ్ ఇయర్ జట్టు మొదటి స్థానం, బ్యాడ్మింటన్ పురుషులలో మెకానికల్ మొదటి స్థానం, మహిళల్లో ఈసీఈ ఫస్ట్ ఇయర్ మొదటిస్థానం సాధించారు. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


పార్టీలోకి చేరిన వారిని కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో జగ్గంపేట మండలం మన్యంవారిపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షులు పోతు రాముడు, మాజీ సర్పంచ్ పోతు కృష్ణ ఆధ్వర్యంలో వైసీపీ చెందిన దళిత కార్యకర్తలు 20 మంది ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మారిశెట్టి భద్రం, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, ముందు ఎర్రబాబు, బొడ్డు బుజ్జి పాల్గొన్నారు.

యనమలను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ పేరాబత్తుల


యనమలతో ఎమ్మెల్సీ పేరాబత్తుల

తుని రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడిని తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యనమల రాజశేఖర్‌ను శాలువా కప్పి అభినందించారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.


చలివేంద్రం ప్రారంభిస్తున్న జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్

చలివేంద్రం ప్రారంభం

గండేపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన రామకుర్తి బ్రహ్మజీ దుర్గాట్రేడర్స్ ఆఫీస్ దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ప్రారంభించారు. బాటసారులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు.

ఉప్పలపాడులో ఉచిత కంటి వైద్య శిబిరం

గండేపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడులో సర్పంచ్ అడబాల రామాంజనేయులు ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆస్పత్రి కాకినాడ వారి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. వందమందికి కంటి వైద్యపరీక్షలు చేశారు.

ఉపసర్పంచ్ రాయుడు జ్యోతి పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం కార్యవర్గ నియామకం

తుని రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ సంఘం తుని యూనిట్ కార్యవర్గం నియామకం గురువారం తుని పెన్షనర్ల కార్యాలయంలో జరిగింది. ఎన్నికల అధికారిగా సంఘ సీనియర్ సభ్యులు ఐ.బాలరామరాజు వ్యవహరించగా గౌరవ అధ్యక్షులుగా మాధవరావు, గౌరవ సలహాదారుగా జె.సీతారామరాజు, సంఘ అధ్యక్షులుగా ఎం.త్రిమూర్తులు, సంఘ జనరల్ సెక్రటరీగా ఆంజనేయ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డానియల్ జోసెఫ్, కోశాధికారిగా జి.కృష్ణ, నలుగురు జాయింట్ నలుగురు ఉపాధ్యక్షులు, 10మంది కార్యనిర్వాహక సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


ఎన్నికైన కార్యవర్గంతో పెన్షనర్ సంఘ సభ్యులు

లోతట్టు ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ


మోతుగూడంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అడ్డతీగల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగల మండలం లోతట్టు పంచాయతీ దొరమామిడి గ్రామంలో గురువారం ఏసీఎం 5శాతం దోమలమందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ అధికారి డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ గవర య్యపేట సచివాలయం పరిధిలోని లంగు పర్తి, కినపర్తి, గవరయ్యపేట పంచాయతీలలో 18గ్రామాలలో 6011 మంది జనాభా కు సంబంధించి 1577 గృహలలో 4766 గదులలో దోమల మందు తమ సిబ్బంది ద్వారా మొదటి విడత పిచికారీ నిర్వహిం చామన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో శ్యాంబాబు, ఎస్‌యూవో అశోక్, ఎంటీఎస్ శ్రీనివాసరెడ్డి, హెచ్‌వీ లక్ష్మీ, హెల్త్ అసిస్టెం ట్స్, ఆశాలు, అంగన్‌వాడీలు వీవో లీడర్స్ పాల్గొన్నారు.

ఇండోర్ రెసిడ్యుల్ స్ప్రే కార్యక్రమం

మోతుగూడెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఒడియా క్యాంప్, ఇంతలూరు వాగు, ఎంసీడీ, ఫోర్‌బై క్యాంప్ గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ వ్యాప్తికి కారణమయ్యే దోమలను నివారించడానికి ఇండోర్ రెసిడ్యు ల్ స్ప్రే (ఐఆర్ఎస్) కార్యక్రమం విలేజ్ టాస్క్‌ఫోర్ బృందంచే నిర్వహించారు. ఐఆర్ఎస్ పిచికారి ప్రభావంతో రాబోయే 40 రోజుల వరకు వ్యాధికారక దోమల బెడ దు ఉండదు. నీటి నిల్వలు, అపరిశుభ్రమైన పరిసరాలు, దోమల వృద్ధికి ప్రధాన కారణాలని గుర్తించారు. వీటిని వారించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఇంతలూరు వాగు ప్రజలుతరుచూ జ్వరాలబారిన పడుతున్నందున అక్కడ ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ నాఫియా సుల్తానా, సూపర్ వైజర్ ముక్తేశ్వరరావు, మంగమ్మ, ఆరోగ్య సహాయకులు సత్యనారాయణ, సాగర్, ఏఎన్ఎం, ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మోతుగూడెం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న గూడూరు పంచాయతీ దబ్బగూడెం గ్రామంలో గురువారం ఉదయం శ్రీ ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠను నిర్వహించారు. విగ్రహదాతలు లోయర్ సీలేరు ఏపీ జెన్‌కోలో సివిల్ ఏడీగా పనిచేస్తున్న దొడ్డ కొండబాబు దంపతులు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామిదేవస్థానం పొల్లూరు వారి సహాయ సహకారాలతో అర్చకుడు అయినవిల్లి కుమార్‌స్వామి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దబ్బగూడెం పటేల్ కట్టం బుచ్చయ్య, మోతుగూడెం సర్పంచ్ ఆకేటి సీత, టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, వరప్రసాద్ పాల్గొన్నారు.

రత్నగిరి అన్నదాన భవనంలో లిఫ్ట్ ప్రారంభం

అన్నవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి దర్శనానికి విచ్చేసే భక్తులకోసం నిర్వహిస్తున్న అన్నదాన భవనంలో నూతనంగా దాత సహకారంతో లిఫ్ట్ ఏర్పాటు చేయగా దీన్ని ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ గురువారం ప్రారంభించారు. కలెక్టర్ సూచనలతో బఫే విధానంలో అన్నప్రసాద వితరణ ప్రారంభించిన అనంతరం వంటపాత్రల్లో ఆహారపదార్థాలు పైకి తీసుకెళ్లడం కష్టతరంగా మారడం, వండిన పదార్థాలు చల్లగా మారుతుండడంతో దాత సహాయంతో దీన్ని ఏర్పాటు చేశారు.

మజ్జిగ పంపిణీ

ఏలేశ్వరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మెయిన్ రోడ్డులో గురువారం తిరగటి రామారావు జ్ఞాపకార్థం వారి కుమారులు సత్యనారాయణ, వెంకటరమణ సౌజన్యంతో బాటసారులకు ఉచితంగా మజ్జిగ అందజేశారు. ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు సఖిరెడ్డి విజయబాబు, సభ్యులు పాల్గొన్నారు.


రౌతులపూడిలో ప్రైవేట్ స్థలంలో గ్రావెల్

రౌతులపూడిలో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

రౌతులపూడి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రౌతులపూడి గ్రామశివారు పేదల ఇళ్లస్థలాలకు చెందిన లేఅవుట్‌లో గ్రావెల్ తవ్వేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. మైనింగ్ చెక్‌పోస్టు సిబ్బంది సైతం పట్టించుకోవడం లేదు. మైనింగ్, రెవెన్యూ అధికారులు గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్‌కు అభినందనలు

జగ్గంపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం కాట్రావులపల్లి ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికలు బుధవారం అర్ధరాత్రి వరకు జరిగాయి. ఈ ఎన్నికల్లో చైర్మన్‌గా కాకరపల్లి కామేశ్వరరావు విజయం సాధించారు. టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌లను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన ప్యానెల్‌లో 9మంది డైరెక్టర్లు విజయం సాధించారు. వైస్‌చైర్మన్‌గా పల్లపాటి కామరాజు, సెక్రటరీగా కానేటి కృష్ణలను ఎన్నుకున్నారు.

సాధికారత సారథుల్లో ప్రత్తిపాడు మొదటిస్థానం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నూతనంగా చేపట్టిన కుటుంబ సాధికారత సారథుల నమోదులో కాకినాడ జిల్లాలో ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రథమస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో ఈ నియోజకవర్గానికి ఆరోస్థానం దక్కింది. టీడీపీ కుటుంబ సాధికారతసారథులను రెండునెలలుగా రాష్ట్రవ్యాప్తంగా నమోదుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గానికి 7244మంది సాధికారత సారథులు నియమించే లక్ష్యంగా నిర్ణయించారు. లక్ష్యాలకు మించి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కృషి మేరకు ఈ సాధికారిత సారథులు 7355మంది నియమించారు.